కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కాప్రా: మాజీ సీఎం కేసీఆర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఆయనను కలిశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలను బీఆర్‌ఎస్ సొంతం చేసుకుంది. కానీ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయింది. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ పరిధిలో పార్టీ ఓటమికి గల కారణాలను అధినేత కేసీఆర్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డితో పాటు మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఉన్నారు.

జేబీఎస్ నుంచి ఈసీఐఎల్‌కు బస్సు ప్రారంభం



అల్వాల్: సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి అమ్ముగూడ, సైనిక్‌పురి మీదుగా ఈసీఐఎల్‌కు 24ఈ నంబర్ బస్సు ప్రారంభమైంది. బుధవారం రాణిగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్ ప్రజల సౌకర్యార్థం ఐదు బస్సులను జేబీఎస్, అమ్ముగూడ, సైనిక్‌పూరి మీదుగా సికింద్రాబాద్–ఈసీఐఎల్‌కు 24ఈ నంబర్ గల బస్సును ప్రారంభించామని డిపో మేనేజర్ శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఆర్టీసీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఐదు బస్సులను నాలుగు ట్రిప్పుల చొప్పున ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు.

రాజకీయం.. రసవత్తరం..

- కాంగ్రెస్‌కు కౌన్సిల్‌లో పూర్తి మెజార్టీ ఉన్నా దక్కని చైర్మన్ పీఠం
- బీఆర్‌ఎస్ చైర్మన్‌కు కాంగ్రెస్ అగ్రనాయకుల మద్దతు
- నిరాశలో ఉన్న కాంగ్రెస్‌లో చేరిన 13మంది కౌన్సిలర్లు
- అగ్ర నేతలు అవిశ్వాసాన్ని అడ్డుకుంటున్నారని ఆవేదన
- ఇలా చేస్తే తాము కాంగ్రెస్‌ను వీడతామంటూ హెచ్చరికలు



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం

మేడ్చల్: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నవిధంగా తయారైంది మేడ్చల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పరిస్థితి. చైర్మన్ పీఠం కోసం ఎన్నో ఆశలు పెట్టుకుని స్థానిక నేతలు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వలలు వేసి, ప్రలోభాలకు గురిచేసి ఎన్నో ఆశలు చూపి కలిసికట్టుగా ఉన్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను చీల్చి ఏకంగా 13 మందిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. మొత్తం కౌన్సిల్‌లో 23మంది కౌన్సిలర్లు ఉండగా చైర్మన్‌తో పాటు ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. 13 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 16కు చేరింది. బీజేపీకి ఒక కౌన్సిలర్ ఉన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 16కు చేరడంతో అవిశ్వాసానికి కావాల్సిన సంఖ్య బలం సమకూరింది. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డిని కుర్చీ నుంచి దించాలని 20 రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు అందజేశారు. దీంతో అధికారులు మున్సిపల్ కార్యాలయానికి అవిశ్వాసం నోటీసు పంపి కౌన్సిలర్ల సంతకాల పరిశీలన పూర్తిచేసి తిరిగి కలెక్టర్ కార్యాలయానికి పంపారు. జూన్ మొదటి వారంలో అవిశ్వాస సమావేశం తేదీ రావాల్సి ఉండగా నాయకుల పైరవీలతో అది పెండింగ్‌లో పడింది.

అన్నీ ఉన్నా.. అక్కడే ఆగింది..

మొదటి నుంచీ చైర్ పర్సన్‌కు వ్యతిరేకంగా ఉన్న కౌన్సిలర్లు బలం లేకుండా, బీఆర్‌ఎస్‌లో ఉన్నన్ని రోజులు నాటి మంత్రి మల్లారెడ్డి ఒత్తిళ్లు, తాయిలాలు, గోవా, మలేషియా ట్రిప్పుల కారణంగా మేడ్చల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం ఆగింది. ప్రభుత్వం మారడం, మెజార్టీ 13 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో బలం 16కు పెరిగింది. మేడ్చల్ మున్సిపల్ పీఠాన్ని తమ పార్టీ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు వ్యూహాలు రచించారు. ఇందులో భాగంగానే నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ కౌన్సిలర్లకు అన్నీ తానై పార్టీలో చేర్చుకుని సీఎం రేవంత్‌రెడ్డితో కండువాలు కప్పించారు. మేడ్చల్ మున్సిపల్ రాజకీయాన్ని పూర్తిగా తన చేతుల్లోకి తీసుకుని అన్నీ తానై నడిపించాడు. చైర్మన్‌ను దించే బాధ్యత తనదే అని చేరికల సమయంలో జంపింగ్ కౌన్సిలర్లకు హామీ ఇచ్చారు.

అవిశ్వాస గండం తప్పించాలని..

మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికరెడ్డిని కుర్చీపై దించడం దాదాపుగా ఖాయం కావడంతో ఆమె భర్త నర్సింహారెడ్డి ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. కుర్చీ కోసం తాను కాంగ్రెస్‌లో చేరతానని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులతో మంతనాలు పార్లమెంట్ ఎన్నికలకు ముందే మొదలు పెట్టారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డితో మంతనాలు జరిపి తన కుర్చీకి ఇప్పట్లో డోకా లేకుండా చేశారు. తన వర్గం కౌన్సిలర్లను, మెజార్టీ బీఆర్‌ఎస్ నాయకులను తీసుకుని తాను కాంగ్రెస్‌లో చేరతానని, తనకు అవిశ్వాస గండం తప్పించాలని నర్సింహారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ అగ్ర నాయకులను కోరడం, వారు సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడి ద్వారా రాయబారాలు నడపడంతో వజ్రేష్‌యాదవ్ పట్టుబడుతున్నా మేడ్చల్ మున్సిపల్ అవిశ్వాస సమావేశానికి తాత్కాలికంగా బ్రేకులు వేయించారు.

అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి..

కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం పెరగడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పాలకుర్తి రాఘవేందర్‌గౌడ్ కౌన్సిలర్ అయిన తన భార్య భవానిని చైర్ పర్సన్ చేయాలని రాజకీయం నడుపుతున్నాడు. కాంగ్రెస్‌లో చేరిన, పాత కౌన్సిలర్లను ఆయన గ్రూపుగా మార్చి అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి అన్నీ తానై వ్యవహరిస్తున్నాడు. అవిశ్వాసం నోటీసు నుంచి మొదలు అన్ని పనులు చకచకా పూర్తి చేశాడు. అవిశ్వాసం తేదీ ఖరారైతే కౌన్సిలర్లను క్యాంపునకు తీసుకెళ్లడానికి అన్ని వనరులను సిద్ధం చేసుకున్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు ఏకతాటిపై నడిచేలా చూసుకుంటున్నాడు. చైర్ పర్సన్‌పై ఆగ్రహంతో పార్టీని వీడిన కౌన్సిలర్లు త్వరగా అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయించాలని ఒత్తిళ్లు తెస్తున్నారు.

కేవలం తమ స్వార్థం కోసం..

తమకు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ పూర్తిగా అండగా ఉన్నా కేవలం తమ స్వార్థం కోసం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి అధికార బలంతో అవిశ్వాస తేదీ రాకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా సుధీర్‌రెడ్డి రాజకీయం నడిపిస్తూ పార్టీకి రావాల్సిన చైర్మన్ పదవిని అడ్డుకుంటున్నారని విమర్శలు చేస్తున్నారు. తామంతా చైర్ పర్సన్ వ్యవహార శైలి నచ్చకపోవడంతోనే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరామని, కాంగ్రెస్‌లో చేరిన తర్వాత కూడా చైర్మన్‌పై తమ ప్రతీకార చర్యలు లేకపోతే తాము పార్టీ మారడంలో అర్థమేముందని వారు నిలదీస్తున్నారు.

పార్టీలో ఉండాలా.. పోవాలా..?

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారితో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఏకతాటిపై వచ్చి చైర్ పర్సన్ దీపికరెడ్డిని కుర్చీ నుంచి దించాలని పట్టుబడుతున్నారు. తామంతా కాంగ్రెస్ పార్టీలో ఉండాలా లేదా బీజేపీలో చేరి తమ పంతం నెగ్గించుకోవాలా అంటూ కౌన్సిలర్లు తమకు అనుకూలంగా ఉన్న నేతలతో అంటున్నారు. చైర్ పర్సన్ భర్త నర్సింహారెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని, ఆయనకు మద్దతిస్తే కాంగ్రెస్‌లో చేరిన తాము తిరిగి వెళ్లిపోతామని కౌన్సిలర్లు హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద మేడ్చల్ మున్సిపాలిటీ రాజకీయం కాంగ్రెస్‌కు పెద్ద సవాల్‌గా మారింది.

సీఎం రేవంత్‌రెడ్డికి వినతి



ఉప్పల్: రాష్ట్రంలో ఉన్న సంచార ఎంబీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 5 నుంచి 10 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆదుకోవాలని కోరుతూ గురువారం గంగిరెద్దుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సారిక మహేష్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్ల నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పల్ డివిజన్ గణేష్‌నగర్ ప్రాంతానికి చెందిన జె.రాజ్యలక్ష్మికి నిమ్స్‌లో చికిత్స కోసం అయ్యే ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.2.5 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని గురువారం కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం అన్నారు. శేఖర్‌రెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌గౌడ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులంతా ఐక్యంగా ఉండాలి



యూత్ ఫెలోషిప్ సమావేశంలో పాస్టర్లు తదితరులు

మల్లాపూర్: క్రైస్తవులు ఐక్యంగా ఉండాలని రెవరెండ్ పాస్టర్ రవితేజ అన్నారు. మల్లాపూర్‌లోని బీర్షెబా అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చిలో యూత్ ఫెలోషిప్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవితేజ, పీపీడబ్ల్యూ అధ్యక్షులు తిమోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవులంతా ఒకరికి ఒకరు సహకరించుకోవాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నరేష్, ఫిలిప్, జోయిల్ వల్లి, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మల్కాజిగిరి: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఆశా వర్కర్ల యూనియన్ ఉపాధ్యక్షురాలు ఎ.హేమలత మల్కాజిగిరి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. హేమలత, రాష్ట్ర కమిటీ సభ్యురాలు వసంత మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనాలు చెల్లించాలని, ఐదు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని, ఇప్పటికైనా మారిన ప్రభుత్వం స్పందించాలన్నారు. మల్కాజిగిరిలో ఉండాల్సిన పీహెచ్‌సీ సెంటర్ అక్కడ లేకపోవడంతో దూర ప్రాంతం నుంచి ఆశా వర్కర్లు రావడమే కాకుండా గర్భిణులను తీసుకువచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా నేరేడ్‌మెట్‌లో ఉన్న పీహెచ్‌సీ సెంటర్‌ను మల్కాజిగిరి ప్రాంతానికి మార్చాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాణి, సమృత, రాజ్యలక్ష్మి, పవిత్ర తదితరులు ఉన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చూడండి



ఈఈ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేసిన శ్రవణ్

మల్కాజిగిరి: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ ఈఈ లక్ష్మణ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో నాలాల్లో పూడిక ఇప్పటికీ ఉందని, తొలగించాలని కోరామన్నారు. వర్షం నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎమర్జెన్సీ టీమ్స్ సంఖ్య పెంచడమే కాకుండా శానిటేషన్, మెట్రో వాటర్‌బోర్డు అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో శరత్‌యాదవ్, పవన్, రాజా, రమేష్ ఉన్నారు.

అనాథ ఆశ్రమంలో పండ్ల పంపిణీ



సుదర్శన్‌రెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నేతలు

బోడుప్పల్: ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బోడుప్పల్ బీజేపీ నేతలు అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బీజేపీ కార్యకర్త పప్పు రాంసూరి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. బోడుప్పల్ బీజేపీ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్, సాయి నరేందర్, పురుషోత్తం, సతీష్, చంద్రశేఖర్ ఆయనకు శాలువ కప్పి కేక్ కట్ చేసి సత్కరించారు.

డబ్బులను తిరిగి ఇవ్వాలన్నందుకు మహిళ హత్య

మేడిపల్లి: అప్పుగా ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వమన్నందుకు ఓ మహిళను ఫోన్ చార్జింగ్ వైర్‌తో హత్య చేసిన ఘటనలో రియల్ ఎస్టేట్ వ్యాపారిని అరెస్ట్ చేసి మేడిపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొన్ని రోజుల క్రితం బోడుప్పల్ కిరాయి గదిలో ఈ నెల 1వ తేదీన మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనలో కేసును ఛేదించినట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు. బెంగళూరుకు చెందిన సత్యనారాయణ పటేల్(60) బోడుప్పల్ మల్లికార్జుననగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటూ స్థానికంగా రియల్ ఎస్టేట్‌లో మార్కెటింగ్ చేస్తున్నాడు. అదేకాలనీలో ఓ అపార్టుమెంటులో ఉషారాణి(60) నివాసం ఉంటోంది. కుమార్తె విదేశాల్లో ఉన్నందున ఒంటరిగా ఉంటోంది. ఉషారాణి కూడా రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ చేస్తుండటంతో సత్యనారాయణతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఉషారాణి వద్ద లక్షన్నర రూపాయలను అప్పుగా తీసుకున్నాడు. తిరిగి డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చేస్తుండటంతో తన రూమ్‌కు రావాలని కోరాడు. ఇంట్లోకి రావడంతోనే ఫోన్ చార్జర్ వైర్‌ను మెడకు చుట్టి హత్యచేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉప్పల్ ప్రాంతంలో గురువారం సత్యనారాయణను అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు పాల్పడినట్లు తెలపడంతో రిమాండ్‌కు తరలించినట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మేడిపల్లి: గుర్తుతెలియని వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ ప్రధాన రహదారిపై రోడ్డు దాటుతుండగా ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్‌వైపు అతివేగంగా వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయం కావడంతో వృద్ధుడు మృతి చెందాడు. అతడికి సుమారు 65 సంవత్సరాలు ఉండవచ్చని, తెల్ల చొక్కా, తెల్ల లుంగీ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపర్చామని, బంధువులు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ గోవింద్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



రోహిత్ ప్రజాపతి(ఫైల్)

మల్లాపూర్: మానసిక ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్‌మల్లాపూర్‌కు చెందిన మహేందర్ కుమారుడు రోహిత్ ప్రజాపతి(23) కొంతకాలంగా ఆర్థికంగా, మానసిక ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

మల్లాపూర్: మతిస్థిమితం బాగాలేక ఓ మహిళ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ నెహ్రూనగర్‌కు చెందిన జోగు కృష్ణ భార్య జోగు బుచ్చమ్మ(50)కు కొంత కాలంగా మతిస్థిమితం సరిగ్గా లేదు. గురువారం ఉదయం ఇంట్లోంచి మల్లాపూర్ సూర్యనగర్ కాలనీలోని ధోబీ ఘాట్‌కు చేరుకొని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ మెకానిక్ షాప్‌లో అగ్నిప్రమాదం

మేడ్చల్‌రూరల్: బైక్ మెకానిక్ షాప్‌లో అగ్నిప్రమాదం సంభవించడంతో ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతైన ఘటన మేడ్చల్ పట్టణంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికుల సమాచారం మేరకు పట్టణంలోని వివేకానంద విగ్రహం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న అర్జున్ చౌహాన్‌కు చెందిన బైక్ మెకానిక్ దుకాణాన్ని రోజులాగే బుధవారం రాత్రి మూసేసి ఇంటికి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున షాప్‌లో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగడంలో 15కు పైగా ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కీసర: కలెక్టర్ ఆదేశాల మేరకు కీసరలోని విత్తన, ఎరువుల విక్రయ దుకాణాలను జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏడీఏ వెంకట్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సీడ్ సెర్టిఫికేషన్ ఆఫీసర్ మహేష్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. కాలం చెల్లిన విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మి, బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.

అవిశ్వాస తీర్మానం వాయిదా హక్కులను హరించడమే..



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు బండారి రవీందర్

మేడిపల్లి: అవిశ్వాస తీర్మానంపై నిర్వహించాల్సిన ప్రత్యేక సమావేశాన్ని జిల్లా కలెక్టర్ వాయిదా వేయడం సభ్యుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే కాకుండా మున్సిపల్ యాక్టుకు విరుద్ధమని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. అవిశ్వాస తీర్మానంపై బలనిరూపనకు అవకాశం ఇవ్వకుండా నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ వ్యవహారశైలితో పాటు కాంగ్రెస్ నాయకుల తీరును విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే స్థానిక సంస్థల మేయర్లు, చైర్మన్ల పీఠాలను హస్తగతం చేసుకోవాలనే ఆరాటంతో చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తనకు సరిపడా సంఖ్యా బలం ఉన్నందున ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా మే నెల 6వ తేదీన కార్పొరేటర్ల సంతకాలతో తనపై తానే నోటీసును కలెక్టర్‌కు అందించినట్లు తెలిపారు. ఈనెల 5న బల నిరూపణకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ఉత్తర్వులను జారీ చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ తక్షణమే అవిశ్వాస తీర్మానంపై బలనిరూపనకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు కార్పొరేటర్లతో పాటు బీఆర్‌ఎస్ పీర్జాదిగూడ అధ్యక్ష, కార్యదర్శులు బండారి రవీందర్, రఘువర్ధన్‌రెడ్డి పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై అధికారుల కొరడా



సాకేత్ రోడ్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

కాప్రా: కాప్రా సర్కిల్ ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై జీహెచ్‌ఎంసీ మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. సాకేత్ రోడ్‌లో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని హెచ్చరిస్తూ.. ఆక్రమణలు తొలగించారు. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో గత్యంతరం లేక రోడ్డుపై పాదచారులు నడకసాగిస్తున్నారు. దీంతో పలుమార్లు ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. ఈ ఫుట్‌పాత్ ఆక్రమణలపై అటు అధికారులు కూడా తూతూమంత్రంగానే చర్యలు చేపడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ పరిధిలో ప్రధాన రహదారులైనా, ఇతర వీధుల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి యథేచ్ఛగా తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. అన్ని చోట్ల ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎప్పటిలాగే ఏదో ఒక రోజు ఆక్రమణలు తొలగించి చేతులు దులుపుకోకుండా సర్కిల్ పరిధిలో ఎక్కడ ఆక్రమణ ఉన్నా వాటిని తొలగించి పాదచారులు సురక్షితంగా నడక సాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.





మాజీ సర్పంచ్ బైరు రాములుపై భూకబ్జా కేసు

పోచారం: ఓ వాచ్‌మెన్ ప్లాట్‌ను కబ్జా చేసిన మాజీ సర్పంచ్‌తో పాటు అతడి కుమారుడిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడలోని సర్వే నంబర్ 756లో ప్లాట్ నంబర్ 261పార్టును బేగంపేట్‌కు చెందిన వాచ్‌మెన్ మల్లారెడ్డి 2005లో కొనుగోలు చేశాడు. ఈ ప్లాటును చౌదరిగూడ మాజీ సర్పంచ్ బైరు రాములు, అతడి కుమారుడు విష్ణుగౌడ్ కబ్జా చేసి, దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరించారు. దీనిపై మల్లారెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. అధికారులు స్పందించి పోచారం పోలీసులను విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విచారణ క్రమంలో భాగంగా మాజీ సర్పంచ్ బైరు రాములుగౌడ్, అతడి కుమారుడు విష్ణుగౌడ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ కాలేజీలో దరఖాస్తులకు ఆహ్వానం

అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న కోర్సులతో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, బోట్‌మీడ్, సీటి, ఏఈటీ, ఈసీటీతో పాటు నూతనంగా ఈ వార్షిక సంవత్సరం నుంచి ఎంఈసి ఈ/ఎం కోర్సు అందుబాటులోకి వచ్చిందని ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతిర్మయి తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం



ఈసీఐఎల్ ఎక్స్ రోడ్‌లోని సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం

కుషాయిగూడ: అన్నిదానాల్లో కంటే అన్నదానం గొప్ప అన్నారు వాసవి మిత్రమండలి ప్రతినిధులు. ఈసీఐఎల్ ఎక్స్ రోడ్‌లోని సాయిబాబా ఆలయం వద్ద వాసవి మిత్ర మండలి మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో అన్నవితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమావాస్య రోజు అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్‌గుప్తా, కోశాధికారి రామిని తిరుమలేశ్‌గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్తా, ఉపాధ్యక్షులు చెన్న చక్రపాణిగుప్తా, నంగునూరి అశోక్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వర్‌రావుకు నివాళి



అల్వాల్: సీపీఐ అగ్రనేత కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్‌రావు జయంతిని బుధవారం వినాయక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో సీపీఐ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వర్‌రావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యాదయ్యగౌడ్, రొయ్యల క్రిష్ణమూర్తి, యాదగిరి, వెంకటేష్‌గౌడ్, అజీజ్, యూసుఫ్, వెంకటరమణ, రాములు, కృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అన్నోజిగూడలో రక్తదానం



పోచారం: అన్నోజిగూడలోని శివాస్ ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి బర్త్‌డే సందర్భంగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.